బాలుడి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, జనవరి 9 : బాలుడి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన రమావత్ చందు కొడుకు రమావత్ రోహిత్ ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలోని బీసీ సంక్షేమ హాస్టల్లో చదువుతున్నాడు. ఇటీవల పాముకాటుతో గాయపడి దవాఖానలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చులకు సంబంధించి రూ.1.50 లక్షల చెక్కును రమావత్ చందు భార్య రజితకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం అందజేశారు. అలాగే విద్యార్థికి పదో తరగతి దాకా మెరుగైన విద్యనందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్ ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

- భార్య మృతిపై ఠాణాలో భర్త ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: తన భార్య మృతిపై అనుమానాలున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం సదరు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన చకినాల దేవరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రెండేండ్ల క్రితం ఆయన ఉపాధికోసం గల్ఫ్ వెళ్లాడు. అయితే దేవరాజు భార్య గతేడాది ఆగస్టులో అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న దేవరాజు ఆ మరునాడు గల్ఫ్ నుంచి వచ్చి అంత్యక్రియలు జరిపించాడు. అయితే తన భార్య అనారోగ్యంతో చనిపోలేదని, కొందరు గ్రామస్తులు వేధింపులకు గురిచేయడం తో ఆత్మహత్యకు పాల్పడిందని గురువారం స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ఇన్‌చార్జి ఎంఈవోకు సన్మానం

బోయినపల్లిలో ఇన్‌చార్జి ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోయినపల్లి, జనవరి 9: బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్‌ను మండలంలోని ఉపాధ్యాయులు శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. కోరెం హెచ్‌ఎంగా పనిచేసిన శ్రీనివాస్‌దీక్షితులు బోయినపల్లి మండల ఇన్‌చార్జి ఎంఈవోగా కొన్నేళ్లుగా పని చేశారని అదే విధంగా బోయినపల్లితోపాటు చందుర్తి, రుద్రంగి మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేశారని, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సేవలందించారని కొనియాడారు. ఆయన చొప్పదండి మండలానికి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రవణ్‌కుమార్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు గసికంటి శ్రీనివాస్, జగన్‌మోహన్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఉషారాణి, తదితరులున్నారు.

పార్టీలకతీతంగా స్పందించాలి

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్

మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్ల టౌన్, జనవరి 9: నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించిన భూములను చిత్తశుద్ధితో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ కోరారు. పార్టీలకతీతంగా ఎవరు ముందుకొచ్చినా తిరిగి అప్పగించడంలో పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. లేనిపోని అభాండాలు మోపి లేనిది ఉన్నట్టు బద్నాం చేయద్దని కోరారు. ఈ మేరకు గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 250 ఎకరాల వరకు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చినట్టు కలెక్టర్ ప్రకటించారని తెలిపారు. అన్యాక్రాంతమైన భూములను అనుభవదారులు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఏ పార్టీకి చెందిన వారైన జైలుకు వెళ్లడం తప్పదని హెచ్చరించారు. ఇటీవల ఓ పత్రికలో తన పేరిట ఓ వార్త వచ్చిందని, అది తనదికాదన్న విషయాన్ని గుర్తించి మళ్లీ సదరు పత్రికలో వివరణ ఇవ్వడం సంతృప్తికరంగా ఉందని వెల్లడించారు. పార్టీలకతీతంగా ఎవరైనా సరే ఆక్రమిత భూములను ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. ఏ పార్టీ నాయకులు అయినా సరే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు, భీమవరం శ్రీనివాస్, దుబాల వెంకటేశం, అల్లె బాలరాజు, స్వర్గం రాజు, మార్గం లక్ష్మణ్, తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ

గంభీరావుపేట, జనవరి 9: మండల కేంద్రంలోని షాదీఖానాలో గురువారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఏఎంసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అందించారు. మండలానికి చెందిన 146 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను రెవెన్యూ అధికారులతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్, డిప్యూటీ తహసీల్దార్ అపర్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, రామచంద్రారెడ్డి, లబ్ధిదారులున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ బోపోజు అశోక్, S/o. సీతారామ్, R/o. వట్టెంల గ్రామం, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీ స్థలం దీని యొక్క మొత్తం విస్తీర్ణం: 181 చ॥గ॥ మరియు దీని సర్వే నెం'లు: 783 & 786 787, లక్ష్మీపూర్ గ్రామం, వేములవాడ పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కల దానిని నాక్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబందించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో. ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 09-01-2025 స్థలము: సిరిసిల్ల

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్, ఇ.నెం.3-7-852/1. వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ముస్తాబాద్, జనవరి 9 : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాధులు దరిచేరకుండా ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గీతాంజలి తెలిపారు. ప్రాథమిక పరీక్షల అనంతరం విద్యార్థులకు మందులు అందించామన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఇక్కడ హెచ్‌ఈవో యాదగిరి, పీహెచ్‌ఎన్ జ్యోతి, హెచ్‌ఎస్ ఎల గొండమ్మ, ఏఎన్ఎం రేణుక, నిర్మల అనిల్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీలత ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఇంటర్మీడియట్ బోర్డ్ అబ్జర్వర్ వసుంధరాదేవి అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఉత్తమ ఫలితాల కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలన్నారు. ఇక్కడ ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వై శ్రీనివాస్, కళాశాల ఇన్‌చార్జి వాసరవేణి పరశురాములున్నారు.

వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, జనవరి 9 : మండల కేంద్రంలో ఎస్ఐ కదిరె శ్రీకాంత్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన దారుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెంట్ తనిఖీ చేశారు. ప్రతి వాహనానికి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని లేనిచో జరిమాన విధిస్తామని ఎస్ఐ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. వాహన దారులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు

సిరిసిల్ల రూరల్, జనవరి 9: సర్దాపూర్‌లో రాష్ట్ర ప్రత్యేక పోలీస్ విభాగంలో 313 మంది కానిస్టేబుళ్లు గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ గంగారం మాట్లాడుతూ, విధి నిర్వహణలో చూపించే ధైర్య సాహసాలు పోలీస్ వ్యవస్థకే వన్నెతెచ్చేలా ఉండాలన్నారు. ఉద్యోగం ఎప్పుడూ సవాళ్లతో ముడిపడి ఇతర శాఖలతో భిన్నంగా ఉంటుందన్నారు. అనంతరం బెటాలియన్ విధివిధానాల గురించి వివరించారు. ఇక్కడ అసిస్టెంట్ రాందాస్, ఆర్ఐ, ఆర్ఎస్ఐలున్నారు.

హైమాస్ట్ లైట్ వితరణ

ఇల్లంతకుంట, జనవరి 9 : పెద్దలింగాపూర్ గ్రామంలోని రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో మాఘ మాస జాతరోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన కేతిరెడ్డి నవీన్ రెడ్డి హైమాస్ట్ లైట్‌ను వితరణ చేశారు. హైమాస్ట్ లైట్‌ను గ్రామస్తుల సహకారంతో గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.

ఊరెళ్లే సమాచారం పోస్టు చేయద్దు

తెలంగాణ చౌక్, జనవరి 9: సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరికెళ్తున్న వారు తమ సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గు రువారం ఎస్పీ ప్రకటన విడుదల చేస్తూ పలు సూచనలు చేశారు. పట్టణాలు, అపార్టుమెంట్ల వాసులు ఊరికెళితే దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ లొకేషన్లను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దన్నారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లో దాచుకోవాలని, బీరువా తాళాలను ఇంట్లో ఉంచవద్దన్నారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉండే తాళం సెక్యూరిటీ అలారం, సెన్సార్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మీ ఏరియాలో అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు కాల్ చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.

వాహనాలు అప్రమత్తంగా నడపాలి

- జిల్లా రవాణా శాఖాధికారి లక్ష్మణ్
- ఆర్టీసీ డిపోలో 'జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం'

మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖాధికారి లక్ష్మణ్

కలెక్టరేట్, జనవరి 9 : రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా వాహనాలు నడపాలని జిల్లా రవాణా శాఖాధికారి వీ లక్ష్మణ్ డ్రైవర్లకు సూచించారు. ఈ మేరకు గురువారం 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని' పురస్కరించుకొని జిల్లా రోడ్డు రవాణా సంస్థ బస్సు డిపోలో నిర్వహించారు. కార్యక్రమంలో డ్రైవర్స్‌కి డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డుపైన ఎంత బాధ్యతగా వాహనాలను నడపాలో డ్రైవర్స్‌కి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డీటీవో వీ లక్ష్మణ్, ఏఎంవీఐ పృధ్వీరాజ్, డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు, జిల్లా రవాణా శాఖాధికారి వీ లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, ఏఎంవీఐ పృథ్వీరాజ్ వర్మ, డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు, ఏఎంఎఫ్ హర్భజన్‌సింగ్, సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, వేణు, టీఐ రామకృష్ణ, రాంరెడ్డి, హెడ్‌గార్డ్ రాజేందర్‌రెడ్డి, రవాణా కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డ్ ఎల్లేశ్, బస్సు డ్రైవర్లు, మెకానిక్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, జనవరి 9: మండలంలోని అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణకేంద్రంలో రవాణాశాఖ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు వివరించారు. ఇక్కడ జిల్లా రవాణా శాఖాధికారి లక్ష్మణ్, వాహన తనిఖీ అధికారి వంశీధర్, సహాయక మోటర్ వాహన తనిఖీ అధికారి రజనీదేవి, పృధ్వీరాజ్, శిక్షణ కేంద్రం నిర్వాహకులు మురుగన్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : హరిదాసు వేషధారణలో విద్యార్థి, గంభీరావుపేట: డిగ్రీ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ముందస్తు సంక్రాంతి సంబురాలు

వేములవాడ టౌన్, జనవరి 9 : వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించుకున్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సన్నిధి వెంకటకృష్ణ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

గంభీరావుపేట, జనవరి 9: మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యాలయం డిగ్రీ కళాశాలలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించగా సంప్రదాయ పరంగా విద్యార్థినులు ముగ్గులు వేశారు. అందంగా ముగ్గుల వేసిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

వేములవాడ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు పర్యవేక్షణ అధికారి వసుంధరదేవి

వేములవాడ/కోనరావుపేట, జనవరి 9 : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి వసుంధరదేవి పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని జూనియర్ కళాశాల, కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి చెడు వ్యసనాలు, సోషల్ మీడియాకి బానిస కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు శరత్, శ్రీనివాస్, కేదారేశ్వర్, అధ్యాపకులు భూమేశ్, శ్రీనివాస్, సుధాకర్, ప్రసాద్, వేణు, శేఖర్, జయభారతరెడ్డి, మహేందర్, దేవయ్య, రవీందర్, గోపి, సంతోష్, అంజయ్య, అశోక్, శ్రీనివాస్‌రావు, లత, మంగమ్మ, అరుణ, స్వప్న, జ్యోతి, దీపికతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు @రూ.3.40కోట్లు

- ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేశాం
- సెస్ ఏఈఈ ప్రశాంత్

బోయినపల్లి, జనవరి 9: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్‌శాఖకు అక్షరాలా 3కోట్ల40లక్షల70వేల 159 రూపాయలు బకాయి పడ్డాయి. బకాయిలు వెంటనే చెల్లించాలని సదరు కార్యాలయాలకు నోటీసులు జారీ చేశామని సెస్ ఏఈఈ ప్రశాంత్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు గ్రామ పంచాయతీ బకాయిలు కూడా బకాయిలు ఉండడంతో నోటీసులు జారీ చేశామన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. బకాయిల వసూళ్లలో విద్యుత్ శాఖ అధికారులు రైతులు, సామాన్యులను ఓ తీరు.. ప్రభుత్వ కార్యాలయాలను మరోతీరు చూస్తున్నారని పలువురు మండిపడ్డారు. ఎంపీడీవో కార్యాలయం రూ.33,013, తహసీల్ కార్యాలయం, రూ.2,12,923, పోలీస్‌స్టేషన్ రూ. 2,44,231, బోయినపల్లి రైతు వేదిక రూ. 15,068, కొదురుపాక రైతువేదిక రూ.14, 568, కోరెం రైతు వేదిక రూ.12, 548, నల్లగొండ రైతు వేదిక రూ.10,523, విలాసాగర్ రైతువేదిక రూ.12,960 బకాయి ఉన్నట్లు సెస్ ఏఈఈ ప్రశాంత్ తెలిపారు.

అసైన్డ్ భూమి కోసం పరస్పర వినతులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: బండలింగంపల్లి గ్రామంలో శాశ్వత ఆస్తులుగా ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ఎస్సీలు అనుభవిస్తున్న అసైన్డ్ భూమిని గ్రామానికివ్వాలని గ్రామస్తులు, ఏండ్ల తరబడి తామే సాగులో ఉన్నామని అది తమకే చెందాలని ఎస్సీలు గురువారం పరస్పరం తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందించారు. వివరాల్లోకి వెళితే, గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి, సబ్ స్టేషన్‌కు స్థలం లేదని సర్వే నంబర్ 262, 278, 253, 250లోని 12–38 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని సదరు భూమిని గ్రామానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ సాయి బాబా కమాన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీసి తహసీల్దార్ రామచంద్రంకు వినతి పత్రం అందించారు. ఇది తెలిసిన గ్రామ ఎస్సీలు సదరు భూమిని తాము దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్నామని అది తమకే ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్సీ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేటలో ర్యాలీ తీస్తున్న గ్రామస్తులు

చైనా మాంజా విక్రయించవద్దు

ఎల్లారెడ్డిపేటలో చైనా మాంజాపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: పతంగుల కోసం చిన్నారులు, ప్రజలకు చైనా మాంజా విక్రయించడం నేరమని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సకారం నాయక్ అన్నారు. గురువారం పలు కిరాణా దుకాణాల్లో చైనా మాంజాపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాదారులు అమ్ముతున్న పతంగులు అందుకు వాడుతున్న దారంపై వివరాలు సేకరించి చైనా మాంజాతో పొంచి ఉన్న ప్రమాదాన్ని తెలిపారు. ఇక్కడ అటవీశాఖ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

లర్నింగ్ లైసెన్సుల అందజేత

బోయినపల్లి, జనవరి 9: మండలంలోని డ్రైవింగ్ లైసెన్స్ లేని యువకులకు ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ గురువారం పోలీస్ స్టేషన్‌లో డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్సులు అందించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండలంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా18 ఏళ్లు నిండిన యువకుల వివరాలు సేకరించి వారి నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ దరఖాస్తులు తీసుకున్నారు. సిరిసిల్ల మోటర్ వాహనాల తనిఖీ అధికారికి పంపించి డ్రైవింగ్ టెస్టింగ్ చేయించారు. అనంతరం 32 మందికి లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

బోయినపల్లి, జనవరి 9: రైతులు అన్ని పంటల సాగుపై వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏవో ప్రణీత కోరారు. గురువారం కోరెం వ్యవసాయ పరపతి సంఘంలో ఎరువుల స్టాకును సింగిల్ విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఏవో ప్రణీత మాట్లాడుతూ, రైతులు పత్తి, వరి మక్క, వేరుశనగ పంటల సాగులో దుక్కి దున్నినప్పటి నుంచి విత్తనాలు వేసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చే వరకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని సాగుచేస్తే దిగుబడి ఎక్కువగా వచ్చి సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు షాపుల్లో కొనుగోలు చేస్తే షాపు యజమానుల నుంచి రశీదు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రైతులు ఏఈవో లక్ష్మణ్ ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట, జనవరి 9: మోడల్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర నాయకుడు పూజ్యం కార్తీక్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను గురువారం సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. వంటగది లేక గుడిసెలో వంట చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ చరణ్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి రాజన్న ఆలయం ముస్తాబు

వేడుకలకు ముస్తాబైన రాజన్న ఆలయం

వేములవాడ టౌన్, జనవరి 9 : ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగే ఉత్తరద్వార దర్శనం వీక్షించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. భక్తుల దర్శనానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు.

ఆరోగ్యంపై ఆందోళన చెందవద్దు

బోయినపల్లి, జనవరి 9: బాలికలు ఆరోగ్య సమస్యలపై ఆందోళన చెందవద్దని బోయినపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ అన్నారు. గురువారం బోయినపల్లి కేజీబీవీ పాఠశాలలో బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బాల బాలికలకు శరీర మార్పులతోపాటు ఆరోగ్య సమస్యలపై ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఏఎన్ఎం, మహిళ వైద్య సిబ్బంది దృష్టికి సమస్యలను తీసుకొచ్చి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని చెప్పారు. ఇక్కడ కేజీబీవీ ఎస్‌వో లింగవ్వ, వైద్య సిబ్బంది ఉన్నారు.

కార్పొరేట్ స్థాయి విద్యాబోధన

వేములవాడ రూరల్/రుద్రంగి/చందుర్తి, జనవరి 9 : ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, రుద్రంగి, చందుర్తి కేజీబీవీ పాఠశాలల్లో ఐఐటీ, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ శిక్షణ తరగుతలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఈవో జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం,ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాత్మికత ఉట్టిపడాలి

కోనరావుపేట, జనవరి 9: అధ్యాత్మికత ఉట్టిపడేలా మాఘ అమావాస్య జాతర నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. గురువారం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 29న జరిగే మాఘ అమావాస్య జాతర ఏర్పాట్లపై అధికారులు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయగా హాజరై మాట్లాడారు. కాగా, ఆలయం ప్రాంగణంలో ఎవరైనా కల్యాణ తంతు నిర్వహించుకునేందుకు అనుమతి ఇస్తున్నట్లు వేములవాడ ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చేయండి.. అభిప్రాయం తెలుపండి

తెలంగాణ చౌక్, జనవరి 9: పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయాల కోసం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌పై స్కాన్ చేసి పోలీసు వారు అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు తెలుపాలని డీజీపీ జితేందర్ తెలిపారు. గురువారం క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లను డీజీపీ కార్యాలయంలో ప్రారంభించగా ఎస్పీ, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్యూ ఆర్ కోడ్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయంతోపాటు సబ్ డివిజనల్, సర్కిల్, అన్ని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేశామన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వీర్నపల్లి, జనవరి 9: మండల కేంద్రంలోని మూలవాగు వద్ద కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పిట్ల రాజు, బొమ్మనవేణి భరత్ ఏపీ 28డీవై 2033 కారులో ఎల్లారెడ్డిపేట నుంచి వీర్నపల్లికి వస్తున్నారు. మూలవాగు వంతెన వద్ద ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఇద్దరు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వివరాలు సేకరిస్తున్నారు.

అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

వీర్నపల్లి, జనవరి 9: అడవుల ప్రాముఖ్యతపై అటవీ శాఖాధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని సీతరాంనాయక్ తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వీర్నపల్లి నర్సరీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌వోలు పద్మలత, భూలా మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. గాలిపటాలకు చైనా మాంజా వాడితే కలిగే అనర్థాలకు వివరించారు. ఇక్కడ బీట్ అధికారులు సతీశ్,కిరణ్, రజిత,బేస్‌క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

నియామకం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ పత్రం స్వీకరిస్తున్న స్వామి

ముస్తాబాద్, జన వరి 9 : జాతీయ బీసీ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శీలం స్వామి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని కార్యాలయంలో జాతీయ బీసీ యూత్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన శీలం స్వామిని నియమించినట్లు బీసీ యూత్ సంఘం జాతీయ అధ్యక్షుడు గడ్డం నర్సింహా వెల్లడించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కలెక్టరేట్, జనవరి 9: అసిస్టెంట్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఇక్కడ టీజీవో అధ్యక్షుడు సమర సేన్, అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లం సాగర్, కోశాధికారి సీహెచ్ విశ్వన్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, అజహరుద్దీన్, జాయింట్ సెక్రటరీ వంశీ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు అరవింద్ ఉన్నారు.

ఆలయ అర్చకుడు అమరవాది మృతి

విజయసారథి (ఫైల్)

ముస్తాబాద్, జనవరి 9 : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు అమరవాది విజయసారథి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుది శ్వాస విడిచారు. విజయసారథి మృతిపై ఆలయ కమిటీ, భక్తులు సంతాపం ప్రకటించారు. దీంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. విజయసారథి అంత్రక్రియల్లో గ్రామస్తులతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.